ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

బుధవారం 16 అక్టోబరు 2024

• పర్యాటకులకు అనుమతి లేదు

నరసాపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు ఎవరిని వేటకు అనుమతించవద్దు. తీరంలో పర్యాటకులకు అనుమతి ఇవ్వవద్దు' అని ఆర్డీవో దాసి రాజు ఆదేశించారు. మంగళవారం చినలంక, పీఎం లంక, పేరుపాలెం, కేపీ పాలెం తీర ప్రాంతాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో పరిస్థితుల్ని సమీక్షించారు. తుఫాన్ తీరం దాటే వరకు సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.





1

2


రోడ్లు.. తూట్లు

వర్షం కురిస్తే చాలు.. జిల్లాలోని రహదారులు ఎంత అధ్వానంగా ఉన్నాయో కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. ఏ మారుమూల రోడ్డు చూసినా ఇదే పరిస్థితి. ఉదాహరణకు.. ఫొటో నెంబరు 1 : ఇది కాళ్ల మండలం కోపల్లెలోని రహదారిని.. ఫొటో నెంబరు 2 : ప్రత్తిపాడు-రాచర్ల రహదారిని చూడవచ్చు.

వల్మీకంలో శ్రీనివాసుడు

ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం గోవు ఇచ్చే పాలను శ్రీ వేంకటేశ్వరస్వామి పుట్టలో ఉండి స్వీకరిస్తున్న అలంకారం చూపరులను ఆకట్టుకుంది. వైకుంఠం వీడి భూలోకానికి వచ్చిన లక్ష్మీదేవిని వెదుకుతూ శ్రీనివాసుడు ఓ పుట్టలో తపోనిష్టుడవుతాడు. దీన్ని గమనించిన బ్రహ్మ, మహేశ్వరులు ఆవు దూడలుగా మారతారు. ఇందులో ఆవు రోజూ స్వామి ఉన్న పుట్ట వద్దకు వెళ్లి అందులో పాలు జారవిడిచి ఆకలి తీర్చేది. ఈ సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు.

- ద్వారకాతిరుమల/ఆంధ్రజ్యోతి





జిల్లాలో కొత్తగా 60 రేషన్ దుకాణాలు

భీమవరం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం వున్న 1,052 షాపులకు అదనంగా 60 షాపులు పెరిగే అవకాశం ఉంది. మొత్తం ఐదు లక్షల 25 వేల రేషన్ కార్డులు ఉండగా షాపుల వారీగా ఎవరికి ఎన్నికార్డులు ఉన్నాయి, ఎవరికి తక్కువగా ఉన్నాయనేది లెక్కలు తేల్చారు. దీని ఆధారంగా గ్రామాల్లో నాలుగు వందల నుంచి 450 కార్డులు ఒక షాపుకు ఉండేలా నిర్ణయించారు. పట్టణాల్లో ఐదు వందల నుంచి 550 వరకు కార్డులుండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాతిపదిక డివిజన్‌లోని మండలాలు, గ్రామాల వారీగా కార్డులను లెక్కలు వేసి కొత్త షాపుల ఏర్పాటుపై తుది నివేదిక సిద్ధం చేశారు. ఈ విభజనకు జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేయాలి. తర్వాత పౌరసరఫరాల ఉన్నతాధికారుల ఆమోదం తర్వాత కొత్త షాపులు ఏర్పాటు చేస్తారు.

18 నుంచి భూముల రీసర్వే గ్రామసభలు

భీమవరం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో రీ సర్వే జరగనున్న గ్రామాల్లో భూయజమానులు అధికారులకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. జిల్లాలో 293 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 174 గ్రామాల్లో పూర్తి చేసినట్లు జేసీ తెలిపారు. 174 గ్రామాల్లో సర్వే, బౌండరీ యాక్ట్ 1923 ప్రకారం సర్వే నిర్వహించి ఆర్‌వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) ప్రకారంగా భూయజమానులకు నిర్ణయించినట్లు చెప్పారు. వీటిపై సంబంధిత భూయజమానులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రీ సర్వే గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని 119 గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలు అక్టోబరు 18 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు.

నేడు కాళ్లకూరు వెంకన్న కల్యాణం

కాళ్ళ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస లఘు కల్యాణం బుధవారం రాత్రి ఏడున్నరకు జరుగుతుందని దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మహోత్సవాన్ని భక్తులందరూ తిలకించాలని కోరారు.

కొత్తగా.. ఖుషీగా..



ఏలూరులో ప్రారంభానికి సిద్ధం చేసిన దుకాణం



జిల్లాలో 175 మద్యం దుకాణాల్లో నేటి నుంచి విక్రయాలు

జిల్లావ్యాప్తంగా 175 మద్యం దుకాణాల్లో విక్రయాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. కొత్త మద్యం విధానం ద్వారా విక్రయాలు సాగించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దుకాణాల ఏర్పాటు, కావాల్సిన సరుకు కోసం ఇండెంట్ పెట్టడం, సిబ్బందిని సిద్ధం చేయడంలో వ్యాపారులంతా తలమునకలయ్యారు. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే దుకాణాలు పెట్టుకోవడానికి అనువుగా కొందరు ప్రయత్నించినా అవి అందుబాటులో లేకపోవడంతో ముప్పుతిప్పలు పడ్డారు.

(ఏలూరు/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మద్యం కొత్త విధానం.. నూతనంగా వ్యాపారం ఆరంభించేందుకు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండగా దుకాణాలు దక్కించుకున్న వారిలో కొందరు మంగళవారం ఒకింత గందరగోళంలో ఉన్నారు. బుధవారం నుంచి కొత్తగా మద్యం బ్రాండ్‌లన్నింటిని విక్రయించాల్సి ఉన్నందున అనభవం ఉన్న వారు ఇండెంట్ సమర్పించారు. దుకాణాల వారీగా ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం కోడ్ వారీగా మద్యం సరఫరా చేస్తోంది. తాము విక్రయించబోయే మద్యం ధరలు ఏ రూపంలో ఉన్నాయో తెలియక, అధికారులు వీటిని వివరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయకపోవడంతో వ్యాపారులు తికమకపడ్డారు. గడిచిన ఐదేళ్లపాటు విక్రయించిన బ్రాండ్‌లలో అత్యధికం ఈసారి లేవు. వాటి స్థానంలో మద్యం ప్రియులు మెచ్చే బ్రాండ్‌లను విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. ధరలు గతంకంటే భారీగా తగ్గుతాయనే ప్రచారం సాగినందున ఏ స్థాయిలో తగ్గుతాయనే దానిపైనే అందరూ తర్జనభర్జన పడ్డారు. ఇప్పటి వరకు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది తమకు న్యాయం చేయాలని నిరసనలకు దిగినా సర్కారు మాత్రం మౌనం దాల్చింది. దీంతో వీరిలో కొందరిని తాజాగా కొత్త మద్యం దుకాణాల్లో తిరిగి తీసుకోబోతున్నారు.

అత్యుత్సాహం

పక్షం రోజులుగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిల్వలను తగ్గిస్తూ వచ్చారు. ఎక్కడా గత మాదిరి వాసనలు కనిపించకుండా జాగ్రత్తపడ్డారు. జె బ్రాండ్ రకాలన్నీ పక్షానికి ముందే నిలిచిపోయాయి. ఒకటి, రెండు బ్రాండ్‌లతోనే కొత్త దుకాణాలు వచ్చేంత వరకు నామమాత్రంగా విక్రయాలు జరిగాయి. కొత్తగా వస్తున్న ప్రైవేటు దుకాణాలపై మద్యపాన ప్రియులు అత్యుత్సాహంతో ఉన్నారు. తమకు కావాల్సిన బ్రాండ్‌లు, బీర్‌లు అందుబాటులోకి వస్తాయంటూ ఉల్లాసంగా చర్చ పెడుతున్నారు. 15 రోజులుగా బార్‌లకు వెళ్ళి జేబులు ఖాళీ చేసుకోవాల్సి వచ్చిందని, కొత్త సరుకు వస్తున్నందుకు సంతోషంగా ఉందని సంబరపడిపోతున్నారు. మందుబాబుల కోరుకునే బ్రాండ్‌లను కొత్త దుకాణాల్లోకి చేరుస్తారా, లేక కొన్నింటికే పరిమితమవుతాయా అనేది నేడు తేలబోతుంది.

మద్యం ఇండెంట్ కోసం కొత్త ముఖాల తిప్పలు

» కొన్నిచోట్ల సర్దుబాటు.. రాయబేరాలు

» ధరపై మద్యం ప్రియుల ఉత్కంఠ

సర్దుబాటు.. రాయబేరాలు..

నేటి నుంచి ఆరంభంకానున్న మద్యం వ్యాపారంలో భాగస్వాములు కావాలని ఎక్కువ మంది ఆశపడ్డారు. లక్షలాది రూపాయలతో దరఖాస్తు చేసుకున్నా లాటరీతో పరిస్థితి తారుమారు కావడంతో సోమవారం నుంచే అనేకమంది సర్దుబాటు.. రాయబారాలకు తెరలేపారు. ఈ వ్యవహారంలో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారని విమర్శలు రాకుండా అధికార పక్ష ఎమ్మెల్యేలు జాగ్రత్తపడ్డారు. దుకాణ లైసెన్సు దక్కిన వారితో నేరుగా మాట్లాడుకోవాలని, తమ వద్దకు రావద్దంటూ ముఖ్య అనుచరులందరికీ తేల్చి చెప్పారు. కొన్నిచోట్ల మాత్రం మీ వ్యాపారం మీరు చేసుకోండి.. ఐదు పైసలో, పది పైసలో వాటా మా వాళ్ళకి ఇచ్చేలా చూడండి, కలిసిమెలిసి వ్యాపారం చేసుకోండి వివాదానికి దిగవద్దంటూ పరోక్ష సంకేతాలు పంపారు. జిల్లావ్యాప్తంగా గడిచిన 48 గంటలపాటు ఇదే తంతు నడిచింది. లాటరీలో ఎమ్మెల్యేలు అనుకూలురకు ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడంతో సర్దుబాటు ప్రయత్నాలపై దృష్టి సారించారు. ముందు దుకాణాలు ఆరంభించండి, తరువాత మాట్లాడుకుందామంటూ కొన్ని ప్రాంతాల్లో వెసులుబాటు ఇచ్చినట్టు చెబుతున్నారు. ప్రత్యేకించి దుకాణాల ఏర్పాటులో ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా సహక రించాలని దుకాణదారులు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులకు మొరపెట్టుకోవాల్సి వచ్చింది.



నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

మొగల్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటుకు వీలు లేదంటూ మంగళవారం మొగల్తూరులో గ్రామస్థులు ఆందోళన చేశారు. శ్రీదేవి జానకి థియేటర్ సమీపంలో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం ఉండేది. దీంతో ఈ ప్రాంత వాసులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం మంజూరుచేసిన మద్యం దుకాణం ఈ ప్రాంతంలో పెట్టవద్దని కోరుతూ ఉదయం నుంచి రాత్రి వరకూ మహిళలు, గ్రామస్థులు బైఠాయించారు. కడలి యుగంధర్, జరుగు నాయుడు, బండి సంపత్ కుమార్, కడలి కిరణ్ కుమార్, కడలి దేవి, నాగమణి, భవానీ ఆందోళనలో పాల్గొన్నారు. ఆందోళనను గుర్తించిన మద్యం దుకాణ యాజమాన్యం పాత స్టేట్ బ్యాంకు కార్యాలయం వద్ద షాపు ఏర్పాటుకు ప్రయత్నించడంతో అక్కడి ప్రజలు ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తమ వీధిలో మద్యం దుకాణం వద్దని, కాదని పెడితే పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. మొగల్తూరు వెంప రోడ్డులో బస్టాండ్ సమీపంలోని ఒక కాంప్లెక్స్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు.



నేటి నుంచి లాసెట్ కౌన్సెలింగ్

2024-25 విద్యా సంవత్సరానికి న్యాయశాస్త్ర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే లాసెట్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలై 20వ తేదీ వరకు కొనసాగుతుంది. 7లో..



ఇన్‌చార్జ్ మంత్రులుగా గొట్టిపాటి, నిమ్మల

పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఏలూరు జిల్లాకు నాదెండ్ల మనోహర్‌ను, తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాలకు నిమ్మల రామానాయుడులను ప్రభుత్వం నియమించింది. 6లో



ఇక్కడ వైద్యం అంతా ఉచితమే

పేదలు, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారిన వైద్య సేవలు.. ఇక్కడ మాత్రం పూర్తి ఉచితం. రెగ్యులర్ వైద్యుల తోపాటు నిపుణులు అందుబాటులో ఉన్నారు. 6లో..

చెత్త తొలగింపునకు రూ.3.50 కోట్లు

» ఎనిమిది నెలలు గడిచినా.. ఎక్కడి చెత్త అక్కడే..





కంపోస్టు యార్డులో ప్రొసెస్ మిషన్, వేజ్ మిషన్

నరసాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):నరసాపురం గోదావరి ఒడ్డున పురపాలక సంస్థకు మూడున్నర ఎకరాల్లో కంపోస్టుయార్డు ఉంది. ఇందులోని చెత్తను బయోమైనింగ్ ద్వారా తడి, పొడి చెత్తగా వేరు వేసి కంపోస్టుయార్డును శుభ్రం చేసి ఖాళీ స్థలాన్ని మునిసిపాల్టీకి అప్పగించాలి. ఎనిమిది నెలల క్రితం దీనికి సంబంధించి టెండర్లు పిలిచారు. అవినాష్ ఏజెన్సీ ఈ పనులను దక్కించుకుంది. అప్పటి లెక్క ప్రకారం కంపోస్టుయార్డులో 51 వేల టన్నుల చెత్త ఉంది. ఒప్పందం ప్రకారం చెత్తను ఒకేసారి తొలగించకూడదు. బయోమైనింగ్ చేయాలి. అంటే తడి, పొడి చెత్తను వేరు చేయాలి. అందులో తడి చెత్త ద్వారా ఎరువులను రైతులకు అందించాలి. ప్లాస్టిక్, ఇతర గాజు, ఆట వస్తువులు వంటి చెత్తను ఇంటిగ్రేడేట్ ప్రొసెసింగ్ యూనిట్ ద్వారా ముక్కముక్కలు చేయాలి. ఈ చెత్తనంతా గుంటూరు జిల్లాలో జిందాల్ సంస్థ ఆధీనంలోని చెత్త ద్వారా తయారయ్యే పవర్ ఫ్యాక్టరీకి అందించాలి. రోజుకు 24 టన్నుల మాత్రమే బయోమైనింగ్ చేయాలి. దాన్ని వేజ్ మిషన్లలో కొలిచి రికార్డు చేయాలి. ఈ పనినంతా ఆరు నుంచి ఏడాది కాలంలో పూర్తి ఖాళీ స్థలాన్ని మునిసిపాల్టీకి అప్పగించాలి.

ఇందుకు గాను ఏజెన్సీకి చెల్లించే మొత్తం రూ.3.50 కోట్లలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 35 శాతం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మిగిలిన 15 శాతం పురపాలక సంస్థ చెల్లించేందుకు ముందుకొచ్చాయి. ఈ పని మాత్రం ముందుకు సాగలేదు. పనిని దక్కించుకున్న ఏజెన్సీ ఏడు నెలల క్రితం చెత్తను క్లీన్ చేసే ప్రొసెసింగ్ యూనిట్‌ను కంపోస్టుయార్డులో బిగించింది. దీంతోపాటు సమీపంలో వేజ్ మిషన్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. ఇప్పటి వరకు పురపాలక సంఘం ఏజెన్సీకి పనులు చేపట్టాలని మూడుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. దీంతో ఈ పని ముందుకు సాగుతుందా ? లేదా ? అన్నది అనుమానంగా మారింది. దీనిపై ఏఈ మణిని వివరణ కొరగా.. ఏజెన్సీకి నోటీసులు ఇచ్చినా స్పందన లేదని చెప్పారు. విషయాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు తెలియజేశామని, అక్కడి నుంచి వచ్చే సమాచారాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం సహాయ నిధికి రూ.83,84,452



విజయవాడ వరద బాధితుల సహాయార్థం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో దాతల నుంచి సేకరించిన రూ.83 లక్షల 84 వేల 452ల చెక్కును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబుకు అందజేశారు.

రూ.51 కోట్లతో 4233 పనులు : కలెక్టర్



భీమవరం రూరల్, అక్టోబరు 15 : గ్రామాల్లో ఎక్కువ మొత్తం ఉపాధి హామీ పనులు చేపట్టి తద్వారా గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం మండలం కొమరాడలో పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు కలెక్టర్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 51 కోట్ల విలువైన 423 పనులను చేపట్టినట్టు చెప్పారు. ఉపాధి హామీ నిధులు ద్వారా గ్రామాలలో రోడ్లు సమస్య తీరనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు కిలోమీటరు దూరంలో ఉండటం తోపాటు స్థలానికి చేరుకోవడానికి మార్గం ఇబ్బందిగా ఉండటం, సుమారు 10, 15 అడుగుల లోతుగా ఉండటం, నిర్మాణాలకు అనువుగా లేని కారణంగా ఈ స్థలాలను రద్దు చేసి వేరేచోట స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్ (ఫైల్)

ఇంటింటికీ వైద్య సేవలు..

జీవితం చివరిలో ఆరోగ్య సహకరించని సమయంలో ఎవరో ఒకరు తోడుండాలి. ప్రస్తుత సమాజంలో ఎవరికి వారే అన్నట్టుగా ఉంది. తల్లిదండ్రులను, తోబుట్టువులను కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. ఏ తోడూ లేని అభాగ్యులకు, పేదలకు మేమున్నా మంటూ ఇంటింటికీ వెళ్లి ఉచితంగా వైద్యం చేస్తున్నారు తణుకు పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు కొందరు.. స్తోమత లేనికి వారికి వారే ఉచితంగా మందులు అందిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రతి ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఇతర వైద్యులు ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. సేవ చేయడంలోనే ఆనందం ఉంది.. అందుకే వయసు మీద పడుతున్నా మాకు తోచిన విధంగా వైద్య సేవలు అందిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా మరిన్ని కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీనియర్ వైద్యులు చెప్పుతున్నారు..

- తణుకు

సేవే దైవం



వైద్యం..ఉచితం

వైద్యం ఖరీదైపోయింది..చిన్న జ్వరమొచ్చినా వేలల్లో సొమ్ములు ఎగిరిపోతున్నాయి.. పేద, మధ్య తరగతికి ఆసుపత్రి ఖర్చులు తలకు మించిన భారమవుతున్నాయి..ఇటువంటి పరిస్థితిలో అలంపురం వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రి బాసటగా నిలుస్తున్నది. నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి ఉచితంగా వైద్యం అందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. 2005లో అలంపురానికి చెందిన కొలనువాడ పెదకృష్ణంరాజు ఈ ట్రస్టును ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు..

పేదలకు బాసటగా అలంపురం శ్రీవెంకట రమణ సేవా చారిటబుల్ ట్రస్టు

వివిధ ఆసుపత్రుల నుంచి వైద్యుల రాక

ఉచితంగా వైద్య సేవలు

అలంపురం ట్రస్టు ఆసుపత్రిలో ప్రతీ రోజు డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రియాంకలు అందుబాటులో ఉండి అన్ని రకాల జనరల్ సమస్యలకు చికిత్స అందిస్తారు. విష్ణు దంత వైద్యశాల నుంచి వచ్చిన వైద్యులు ఉచితంగా చికిత్స అందిస్తారు. ప్రతీ గురువారం ఇక్కడి నుంచి భీమవరం విష్ణుదంత కళాశాలకు ఉచిత బస్సు సదుపాయం ఉంటుంది. అవసరమైనవారిని అక్కడ తీసుకువెళ్లి ఉచితంగా చికిత్స అందిస్తారు. డాక్టర్ జే.సాగర్‌బాబు ఫిజియో థెరఫీ సేవలు అందిస్తారు. దీనికి సంబంధించి అన్ని రకాల మిషనరీ సదుపాయం కూడా ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య సేవలు ఇవీ..

రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రతీ గురువారం ప్రత్యేక వైద్యులు వస్తారు. నెలలో ప్రతీ మొదటి, మూడవ గురువారాలు ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరి తిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్యులు విచ్చేసి వైద్య సేవలందిస్తారు. ప్రతీ రెండవ, నాల్గవ గురువారాలు జనరల్ మెడిసిన్, కాన్సర్, గైనకాలజిస్ట్, చిన్నపిల్లలు , గుండె సంబంధిత వ్యాధి నిపుణులు వస్తారు. ప్రతీ శని, ఆది వారాలలో రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల నుంచి కంటి వైద్యనిపుణులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. కళ్ళ జోళ్ళు అవసరమైన వారికి రాయితీపై అతి తక్కువ ధరలో అందజేస్తారు. ప్రతీ నెల మూడవ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తారు. తల, మెదడు, వెన్నుముక, నరాలకు సంబంధించి చికిత్స అందిస్తారు. రెండు నెలలకు ఒకసారి హైదారాబాద్ నుంచి షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ విచ్చేస్తారు. ఈ ఆసుపత్రిలో షుగర్, కిడ్నీ, లివర్ తదితర రక్త పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహిస్తారు. ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు జరుపుతారు.

ఉచిత భోజన సదుపాయం

ట్రస్టు ఆసుపత్రికి వచ్చే రోగులు మధ్యాహ్నం భోజనం గురించి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ట్రస్టు ఆసుపత్రి వద్దే ఉచిత భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి వచ్చి ప్రతీఒక్కరూ ఇక్కడే ఉచితంగా భోజనం చేసి వెళ్ళేలా ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించారు

జీఎస్ఎల్‌కు బస్సు

మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రతీ శుక్రవారం ఉచిత బస్సు సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్టు ఆసుపత్రి నుంచి వెళ్లిన రోగులకు ఆరోగ్యశ్రీలో రాని ఆపరేషన్లు గాని టెస్ట్‌లు గాని ఏమైనా ఉంటే 25 శాతం రాయితీ కల్పిస్తారు. వైద్యం కోసం వెళ్లేవారు తమ వెంట రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, పాత మెడికల్ రిపోర్టులు తీసుకువెళ్లాలి.

-పెంటపాడు

ట్రస్టు పేరున 40 ఎకరాలు



నలుగురికి సాయపడడంలో ఆనందం ఉంటుంది. 2001 నుంచే సేవా కార్య క్రమాలు చేపట్టాను. కంటి చూపులేని వృద్ధులను నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ కంటి ఆసుపత్రికి పంపించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించాను. మా కళ్ళు కన పడుతున్నాయని ఆనందంతో వారు నన్ను మెచ్చుకోవడం నా కంట్లో నీళ్ల తిరిగేలా చేశాయి. అప్పుడే నిర్ణయించుకున్నాను. ప్రజల కోసం ఉచితంగా వైద్య సేవలు ప్రారంభించాలని.. 2005లో ట్రస్టు రిజిస్టర్ చేయించాను. అప్పటి నుంచి నిరంతరంగా వైద్య సేవలు కొనసాగిస్తున్నాను. నేను ఉన్నా లేక పోయినా ట్రస్టు సేవలు ఆగకూడదన్న ఉద్దేశంలో ట్రస్టు పేరు మీద 40 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించాను. కొత్తగా నాలుగున్నర ఎకరాల పొలం కూడా కొన్నాను. త్వరలో ఇక్కడ 100 పడకల ఆసుపత్రి, వేంకటేశ్వరస్వామి మందిరం, కంప్యూటర్, మెకానిక్, టైలరింగ్ తదితర వాటిలో ఉచిత శిక్షణ కేంద్రం, అనాథాశ్రమం వంటివి నిర్మించాలని నిర్ణయించుకున్నాను. ఇది నా చిరకాల కోరిక. నేను న్నంతవరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాను.

-కొలనువాడ పెదకృష్ణం రాజు, ట్రస్టు చైర్మన్

రేపు ప్రత్యేక వైద్యుల రాక

అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 17న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు,గొంతు సంబంధ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



120 ఏళ్లయినా చెక్కు చెదరలే..

చింతలపూడి తాలూకా కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ భవనానికి 120 ఏళ్ళు. 1904లో బంగాళా పెంకుతో నిర్మించిన ఈ రాతికట్టడం ఇప్పటికీ చెక్కు చెదరకుండా పటిష్ఠంగా ఉంది. బ్రిటీష్ పరిపాలనలో ఇది నిర్మించబడింది. అప్పట్లో బ్రిటీష్ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు విడిది భవనంగా ఉప యోగించేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1964లో ఈ భవనంలో తాలూకా మున్సిబ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేశారు. 2007 వరకు నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఈ భవనం ఎంతో హుందాగా ఉండేది. ఆవరణలోకి ఎవరు రావాలన్నా వాహనం దిగివచ్చేవారు. అంత గౌరవంగా ఉండేది. కోర్టు మరో చోటుకి మారిపోయింది. అప్పటి నుంచి ఈ భవనాన్ని రెవెన్యూ అధికారులు ఉపయోగిస్తున్నారు. ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంగాను, సాధారణ రోజుల్లో వీడియో కాన్ఫరెన్స్ హాలుగా వినియోగిస్తున్నారు. ఈ భవనం చూడటానికి క్యాంపస్ లోకి వచ్చే ప్రతివారు ఈ భవనం పటిష్ఠత గురించి చర్చించుకుంటారు.

- చింతలపూడి




ఇన్‌చార్జి మంత్రులుగా మనోహర్, గొట్టిపాటి

నిమ్మలకు రెండు జిల్లాల బాధ్యతలు

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జ్‌ల మంత్రులను నియమించింది. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా, ఏలూరు జిల్లాకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లను నియమిస్తూ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను సమీక్షించి దిశానిర్దేశం చేసే బాధ్యతలను ఇన్‌చార్జ్ మంత్రులు నిర్వహించనున్నారు. ప్రతి ప్రభుత్వంలోనూ జిల్లాకు ఇన్‌చార్జ్‌ను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులను పరిశీలించి పర్యవేక్షించడంలో ఇన్‌చార్జ్ మంత్రులు కీలకంగా వ్యవహరిస్తారు. జిల్లాకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్న గొట్టిపాటి రవికుమార్‌కు పల్నాడు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్‌గా నియమించింది. సీనియర్లకు మాత్రమే రెండు జిల్లాలకు బాధ్యతలు అప్పగించారు. ఆ క్రమంలోనే జిల్లా నుంచి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తూర్పు గోదావరితో పాటు, కర్నూలు జిల్లాకు కూడా ప్రాతినిధ్యం వహించనున్నారు. సమర్థవంతంగా పనిచేస్తారన్న నమ్మకంతో నిమ్మలకు రెండు జిల్లాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించింది. ఏలూరు జిల్లా రాజకీయాలతో సత్సం బంధాలు ఉండడం, వివాద రహితుడిగా పేరొందిన మనోహర్‌ను నియమించడం అటు టీడీపీ, ఇటు జనసేనలో హర్షం వ్యక్తమైంది.



రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, దుర్గేష్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు

కూటమిగా పనిచేద్దాం..ఎమ్మెల్సీని గెలిపిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్ టేబుల్ సమావేశం


రాజమహేంద్రవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమిగా పనిచేసి గెలిపిద్దామని కూటమి నేతలు ప్రతినబూనారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యవేక్షణలో మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడారు. కూటమి అభ్యర్థి గెలవడానికి అందరి సహకారం కావాలన్నారు. గ్రాడ్యు యేట్లు అందరినీ నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. రేపటి నుంచే నమోదు మొదలు పెట్టాలన్నారు.రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గోదావరి జిల్లాల ప్రజలు 34 ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాలను ఇచ్చారు. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే మొదటి ఎన్నికలు. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధం లేదని మళ్లీ ఓటర్లను చేర్పించాలన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయ స్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికలో కూడా కొనసాగించాలన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉండగానే విద్యావంతులైన పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీకి ఇచ్చారని, ఇక్కడ కూడా గెలిచి అదే చరిత్రను కొనసాగించాలన్నారు. మరోమంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కలసి పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దామన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అందరం ఐక్యంగా కలసి పనిచేసి అభ్యర్థిని గెలిపిద్దామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేయించేలోపు అభ్యర్థిని ప్రకటిస్తే మంచిదని సూచించారు.ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు. చింతమనేని ప్రభాకర్, పంతం నానాజీ, సృజనా రంగారావు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, బొడ్డు వెంకటరమణ చౌదరి, కూటమి నేతలు ఆదిరెడ్డి అప్పారావు, గన్నికృష్ణ, తోట సుధీర్, అనుశ్రీ సత్యనారాయణ, కాశిరాజు, పాకా సత్యనారాయణ, బొమ్ముల దత్తు, రంగబాబు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా గణాంక అధికారి విశ్వేశ్వర ప్రసాద్

యాప్‌తో పాటు రిజిస్టర్లు, రికార్డులు మెయింటెన్ చేయాలి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆన్‌లైన్ యాప్‌లతో పాటు రిజిస్టర్లు, రికార్డులను కూడా మెయింటైన్ చేయాలని జిల్లా గణాంక అధికారి విశ్వేశ్వర ప్రసాద్ అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో జిల్లా ఎన్‌హెచ్ఎం టాస్క్‌ఫోర్సు టీం రికార్డులు, రిజిస్టర్లు, ఆన్‌లైన్ డేటాను పరిశీలించారు. తప్పులను సరి చేయించి తగిన విధంగా రికార్డులను రూపొందించాలని సూచనలు చేశారు. దగ్గరలోని జడ్పీ హైస్కూల్ విద్యా ర్థులు 30 మందికి, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఐదుగురు, గర్భిణులు ఐదుగురికి రక్తహీనత పరిక్షలు చేశారు. రక్తం తక్కువ ఉన్నవారికి పోష కాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, అమలేశ్వరరావు, డి.కమల, శిరీష, మార్త, రూపాదేవి, శ్రీనివాస్, ఆశాలు లక్ష్మీ, రాధ తదితరులు ఉన్నారు



విద్యార్థులతో మాట్లాడుతున్న భీమవరం సివిల్ న్యాయాధికారి అప్పలస్వామి

హాస్టళ్ళను తనిఖీ చేసిన న్యాయాధికారులు

భీమవరం క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.అప్పలస్వామి భీమవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ళను తనిఖీ చేశారు. ఉండి పెదపేటలో ఉన్న ఎస్సీ గవర్నమెంట్ బాలికల హాస్టల్‌ను సందర్శించి పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి, అవసరమైన సదుపాయాల గురించి పిల్లలను, వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను, వంట గది, డైనింగ్ హాల్, బెడ్‌రూం, వాష్ రూమ్‌లను పరిశీలించారు. ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, కె.జ్యోతి, ఎంబి భవాని, బి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు 17న స్పాట్ కౌన్సెలింగ్

దివాన్‌చెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎం.ఎ, ఎం.కామ్, ఎంపీఈడీ, ఎం.ఎస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లుకు ఈ నెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు..

చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. మండలంలో ముందుగా వేసిన 1010 రకం వరి పంట కోతలు జరుగుతుండగా, 1224 వరి రకం 10-15 రోజుల్లో కోత దశలో ఉంది. తుఫాను భయంతో కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో హడావుడిగా కోస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరిపంట నేలవాలి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 112 సాగునీటి చెరువులు, తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల్లో వరిసాగు జరిగింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతుండటంతో రైతుల కంటి మీద కునుకు ఉండటం లేదు. తుఫాను గండం నుంచి కాపాడాలని రైతులు దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

ట్రిపుల్ ఐటీ ఎంఓయూ

నూజివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెరబుల్ అనే సంస్థతో నూజివీడు ట్రిపుల్ ఐటీ మంగళవారం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ కార్య క్రమంలో భాగంగా డేటా సెంటర్ వ్యవస్థాపకులు ప్రణవమూర్తి, జోసఫ్, సురేంద్రలు నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని, కోడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. అనంతరం ట్రిపుల్ ఐటీలోని 15 మంది విద్యార్థులను లాంగ్ టెర్మ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

చారిత్రక వైభవం



వివాహమైనా, జాతరైనా ఏ మంచి పనైనా ఊరికి దూరంగా ఉన్న మల్లయ్యపోడు నుంచి ప్రారంభించడం అక్కడి ఆచారం. కానీ అక్కడ ఒక పెద్ద శివాలయం ఉందనే సంగతి పూర్వీకుల మాటల్లో తప్ప వారెప్పుడూ చూసి ఎరుగరు. 15 సంవత్సరాల కిత్రం జరిగిన ఒక సంఘటన కొన్ని వాస్తవాలను గ్రామస్థులకు పరిచయం చేసింది.. -నూజివీడు టౌన్



చరిత్రకు దొరకని ఆలయం

నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలోని మల్లయ్యపోడులో పదిహేనేళ్ల క్రితం వ్యవసాయ భూమిలో పంటల సాగుకు వేసిన పైప్‌లైన్ నీరు ఒక రాయిపై ధారాళంగా పారింది. శివునికి జలాభి షేకం జరిగిన విధంగా క్రమక్రమంగా భూమిలో పాతుకుపోయిన పెద్ద పాలరాయి శివలింగం బయటపడింది. శివలింగం చుట్టూ గర్భాలయం నిర్మాణం ఉన్న విధంగా ఇటుకరాళ్ళ నిర్మాణం కనిపించింది. పూర్వీకులు చెప్పినట్టుగా అత్యంత పురాతన ఆలయం అక్కడ ఉందనే వాదనలకు బలం చేకూరింది. అయితే ఆ ఆలయం ఏ కాలం నాటిది ?? ఎవరు నిర్మించారనేది తేలాలంటే పురావస్తుశాఖ పరిశీలించి చెప్పాలి..

నమ్మకాలు సజీవం

మల్లయ్యపోడులో శిథిల నందీశ్వరునికి, ఆంజనేయస్వామికి తరతరాలుగా గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. తరాలు మారుతున్నా వారి ఆచార వ్యవహారాలను ఆచరిస్తూనే ఉన్నారు. మల్లయ్యపోడులో శిథిలమైన నంది విగ్రహంతో పాటు హను మంతుని విగ్రహం శతాబ్దాలుగా పూజలు అందుకుంటున్నాయి. రావిచర్ల వాసులు ఏ శుభకార్యం తలపెట్టినా అక్కడ పూజలు నిర్వహించి ప్రారంభించేవారు.



← నిట్టనిలువునా చీలి వున్న శివలింగం

బిడ్డ అడ్డం తిరిగిందని చెప్పే నందీశ్వరుడు

రావిచర్ల గ్రామంలో పురుడు పోసుకునే మహిళకు పురుడు కష్టమైతే ఆ ఇంటి పెద్ద మల్లయ్య పోడులోని నందీశ్వరుని వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేసేవారు. ఈ క్రమంలో నందీశ్వరుని తల పక్కకు తిరిగి ఉంటే దానిని సరి చేసి ఇంటికి తిరిగివెళ్లే సమయానికి మహిళకు సుఖప్రసవం జరిగేదని గ్రామస్థులు చెబుతారు. గంగానమ్మ జాతరతో పాటు ఇతర శుభకార్యాలు ఇక్కడి నుంచే ప్రారంభిస్తారు.

నిట్టనిలువునా చీలి వున్న శివలింగం


వ్యవసాయ భూమిగా ఉన్న పొలంలో నీరు పెట్టగా ఆ నీటి ధారకు శివలింగం బయటపడింది. అది ఒక రాయిగా భావించిన స్థానికులు దాన్ని బయటకు తీద్దామని చుట్టూ దాదాపు ఆరు నుంచి ఏడు అడుగులు తవ్వగా భారీ శివలింగం కనిపించింది. అయితే నిట్టనిలువుగా పగులకొట్టబడి ఉండటంతో ఎలాగైనా శివ లింగాన్ని బయటకు తీయాలని రైతులు ప్రయత్నించారు. అయినా సాధ్యం కాకపోవడంతో తిరిగి గోతిని పూడ్చి వేశారు. నాటి నుంచి ఆ శివలింగానికే పూజలు చేస్తూ వస్తున్నారు.

నిజాం పాలనలో ఆలయం ధ్వంసం

రావిచర్ల మల్లయ్యపోడులో శివాలయం అత్యంత పురాతన మైనదని గర్భాలయం ఇటుకలతో నిర్మాణం చేసి ఉందని, ఒక్కో ఇటుక అర్థగజం పొడవు, వెడల్పుతో ఉన్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. అయితే గతంలో రావిచర్ల పక్కనే ఉన్న బోర్వంచ గ్రామం నిజాం పాలనలో ఉందని నిజాం దండయాత్రలతోనే ఈ ఆలయం ధ్వంసమైందని చెబుతున్నారు.

పురావస్తు శాఖ పరిశోధన చేస్తే తెలుస్తుంది

అధికారుల పరిశోధన చేయడం ద్వారా నూజివీడు ప్రాంతంలో శాత వాహనులు లేదా ఆ తరువాత రాజ్యమేలిన రాజుల పాలనలో ఇక్కడ ఆలయం నిర్మించినదా అనేది తెలుస్తుంది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పరిశోధనలు చే స్తే ఆలయ విశేషాలను వెల్లడి అవుతాయని గ్రామస్తులు కొణతం సాంబశివరావు, మరీదు గోవింద రాజులు, కుటుంబరావు చౌదరి, మరీదు సత్యనారాయణ, చెన్నకేశవరావు, సీతారామయ్య, శ్రీనివాసరావు తదితరులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామి విగ్రహం



నిట్‌లో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని నిట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో శాస్త్రవేత్తగా దేశానికి ఎన్నో విశిష్ట సేవలు అందించిన ఘనత అబ్దుల్ కలాం కే దక్కుతుందన్నారు. ఆయన మాటలు ఎంతో మంది యువతలో చైతన్య స్ఫూర్తిని నింపాయన్నారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతోనే రైతుల ఆర్థికాభివృద్ధి

ఉద్యాన పంటలను పరిశీలించిన డీసీసీడీ బృందం



కోకో పంటను పరిశీలిస్తున్న డీసీసీడీ బృందం

పెదవేగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా ఎదగాలంటే అంతర పంటల సాగు ఒక్కటే మార్గమని కేరళ రాష్ట్రం కొచ్చిన్ కొబ్బరి, కోకో అభివృద్ధి సంచలనాలయమ్(డీసీసీడీ) డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా అన్నారు. తాళ్ళగోకవరం, లక్ష్మీపురం గ్రామాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరంగా సాగు చేస్తున్న కోకో, మిరియం పంటలతోపాటు నాగులదేవునిపాడు గ్రామంలో కోకో ప్రాసెసింగ్ యూనిట్, మోండెలేజ్ కోకో నర్సరీని బృందం పరిశీలించింది. రైతులు అనుసరిస్తున్న సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులు మార్కెటింగ్ సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా మాట్లాడుతూ పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, సాగులో ఎదురవుతున్న ఒడిదుడుకులను దృష్టిలో పెట్టుకుని రైతులు కూడా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పంటలసాగు చేపట్టాలన్నారు. తద్వారా నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే పంట సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేరని, దీన్ని అధిగమించడానికి అంతర పంటల సాగు చేపట్టాలని ఆమె సూచించారు. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో, మిరియం వంటి పంటలను సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీడీ ఎస్టీఏ నిఖిల్, ఏలూరు జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఆర్.రామ్మోహన్, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి కె.రత్నమాల, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండల ఉద్యానశాఖాధికారి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై
గుజరాత్ ప్రతినిధుల అధ్యయనం

ఏలూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయటానికి గుజరాత్ రాష్ట్ర ప్రతినిధులు మంగళవారం వెంకటాపురం గ్రామంలో పర్యటించారు. రైతు సాధికార సంస్థ ప్రదర్శించిన సార్వత్రిక సూత్రాలను వీరు పరిశీలించారు. అందులోని 9 సూత్రాలను సిబ్బంది వివరించారు. అక్కడే ఉన్న వరి కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించి ఏగ్రేడ్ వరి పొలం చూసి అందులో ఆదాయ వ్యయాలు, ఎక్స్‌పర్‌మెంట్ డేటాను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆదాయ వ్యయాలు, ప్రకృతి వ్యవసాయంలోకి ఎలా ఎందుకు మారారనే మార్పులు గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అనుసరిస్తున్న పద్ధతిని చూసి ఆదర్శవంతంగా ఉండటం ఆనందంగా, ఆశ్చర్యంగా ఉందని గుజరాత్ ప్రతినిధులు వారిని అభినందించారు. అనంతరం అమ్మపాలెం గ్రామంలోని కె.రంగయ్య, 5లేయర్ మోడల్‌ను తిలకించారు. జీవ వైవిధ్యం, జీవామృతం కిట్‌ను పరిశీలించారు. పామాయిల్లో వివిధ రకాల పసుపును పెంచటం, డ్రైయింగ్ ప్రాసెసింగ్ యూనిట్లు చూశారు. అనంతరం గుండుగొలను, ద్వారకాతిరుమలలో కషాయాలు, జీవ ఉత్ప్రేరకాలు తయారీ విధానాన్ని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద మంగళవారం జరిగిన అండర్-14 బాలుర, బాలికల యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పసుపులేటి రాజేష్, అర్జుల మానస (మొదటి స్థానం), రాపాక వినయ్, కోట లక్ష్మి (తృతీయ స్థానం)లను, వారికి శిక్షణ ఇచ్చిన బడుగు చంద్రశేఖర్‌ను సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ అభినందించారు.



గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కానున్నందున గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ముద్దాపురం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ముందుగానే రైతు సేవా కేంద్రంలో పంట కోతలకు పది రోజులకు ముందుగా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. జూలైలో పంట నష్టం సొమ్ము తాలూకా నిధులు రెండు వారాల్లోపు విడుదల కావచ్చని రైతులకు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి.రమేష్, ఎంవో కె.కుసుమ పాల్గొన్నారు.

కాలుజారి చెరువులో పడి వ్యవసాయ కూలీ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): కాళ్లకు మట్టి ఉందని చెరువులో కడిగేందుకు దిగిన వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన మాధవరంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మాధవరంకు చెందిన జె రాజేష్ (33) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. మాధవరంలోని చెరువులో కాలుజారి పడిపోయాడు. స్థానికులు అతన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా రాజేష్‌ను కాపాడలేకపోయారు. రూరల్ ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. మృతుడు రాజేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

భీమడోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమడోలు పోలీసు స్టేషన్ పరిధిలోని పూళ్ల గ్రామంలో కుమ్మరికుంట వీధికి చెందిన పచ్చా సీతారత్నం (65) ఈ నెల 14 రాత్రి భోజనం చేసి పడుకున్నది. అయితే తెల్లవారు జామున చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకి లభ్యం కాకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

ఈ రోడ్డుపై వాహనాల పల్టీ



గణపవరం నుంచి జల్లి కొమ్మర మీదుగా తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారి గుంతలమయంగా మారి ప్రజల పాలిట శాపంగా పరిణమించింది. ఈ రోడ్డులో వరదరాజపురం, వెలగపల్లి జల్లికొమ్మర వరకు గోతులు మయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తోంది. పెద్దగోతుల వలన వాహనాలు బోల్తాకొట్టి పంటపొలాల్లో పడిపోతున్నాయి.

- గణపవరం

రహదారులు ఛిద్రం

కాళ్ళ మండలంలోని భీమవరం - గుడివాడ రాష్ట్రీయ రహదారి అడుగుకో గొయ్యి అన్న చందంగా మారింది. కోలనపల్లి - ఆకివీడు, వేంపాడు - కోపల్లె, సీసలి - కోమటిగుంట, జువ్వలపాలెం - ఆకివీడు, పల్లిపాలెం - మాలవానితిప్ప, కలవపూడి - మోడి రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

- కాళ్ళ



అమ్మో బైపాస్..రోడ్డు

భీమవరం పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా ఉండేందుకు ఎంతో ఉపయోగపడే బైపాస్ రోడ్ పరిస్థితి దయనీయంగా మారింది. భారీ గోతులు పడటంతో వాహనాలు రోడ్డుపై పడి గాయాల పాలవుతున్నారు. రెండు రోజులు క్రితం భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పడంతో కిందపడి పోయారు. ఇద్దరికి, తీవ్ర గాయాలు అయ్యాయి. బుల్లెట్ మీద వెళుతున్న ఇద్దరు యువకులు భారీ గోతిలో పడిపోవడంతో కాళ్ళకు గాయాలు అయ్యాయి. ఒక కారు గోతిలో పడటంతో మరమ్మతులకు గురైంది.

- భీమవరం క్రైం



ప్రత్తిపాడు- రాచర్ల రహదారి దుస్థితి

పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు నుంచి రాచర్ల వెళ్ళే ఆర్అండ్ బీ రహదారి వర్షాలకు ధ్వంసమైంది. 2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు ఈ రహదారిని వేశారు. తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారిని పట్టించుకోలేదు. రహదారి వెంబడి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అధిక బరువుతో 10 చక్రాల లారీలు ఈ రహదారిలో ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తాయి. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా తయారయ్యింది. రాత్రివేళ ఈ రహదారిపై ప్రయాణం చేస్తే అంతే సంగతులు. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నది.

- పెంటపాడు



రహదారులా.. చెరువులా!

పశ్చిమగోదావరి జిల్లాలో వర్షాల కారణంగా ప్రధాన రహదారులపై ఏర్పడిన అగాథం లాంటి గోతులు యమగండాల్లా దర్శనమిస్తున్నాయి. ఈ గోతుల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. మోకాలు లోతు గోతుల వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల అనేక మంది గాయపడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లకు మహర్దశ పడుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



రోడ్లపైకి పంట చేలో నీరు

పాలమూరు శివారు నౌడూరు జంక్షన్ సమీపంలో బ్రాహ్మణ చెరువు-వీరవాసరం రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం నీరు రోడ్డుపైకి చేరడంతో మురుగు వెళ్లే పంట బోదెలు ఆక్రమణకు గురికావడంతో రోడ్డుపైనే నీరు ఇంకిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది దీంతో తరచూ ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది.

- పెనుమంట్ర



గోతుల రహదారి

గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం మీదుగా ఉండి వెళ్ళే పంచాయతీరాజ్ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. ఈ రహదారి నిర్మించి సుమారు నాలుగు సంవత్సరాలైంది. వర్షాలకు రహదారి పూర్తిగా పాడైపోయింది. సుమారు రెండు కిలోమీటర్లు గోతులమయంగా మారింది.

- పాలకోడేరు

బురద దారులు



అక్కుపల్లిగోకవరం-కంసాలిగుంట రహదారిలో పెద్ద గోతులు పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కైకరం-గుణ్ణంపల్లి రహదారి కూడా ఇదే పరిస్థితి. బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారిలో ఆర్టీసీ బస్సులు విన్యాసాలు చేస్తున్నాయి. దొంతవరం- కాగుపాడు రహదారి వర్షాకాలంలో ద్విచక్ర వాహనదారులు నరకం చూస్తున్నారు.

- ఉంగుటూరు

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తణుకు ఆర్టీసీ బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. ఒంటి పైన చారలు చొక్కా, కళ్ళకు అద్దాలు ఉన్నాయి. 34వ వార్డు సచివాలయం రెవెన్యూ సెక్రటరీ గంటి లక్ష్మి దానేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంట కాల్వలో మృతదేహం

తణుకు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండపాక గ్రామంలో పంట బోదెలో వ్యక్తి మృత దేహం లభ్యమయ్యింది. మంగళవారం కాలువలో సుమారు 40 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. అతని ఒంటిపై ఒక టీషర్టు, ఒక షార్ట్ ఉందని, ఒంటి మీద ఎలాంటి గుర్తులు లేవని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే తణుకు రూరల్ పోలీసు స్టేషన్ 94407 96641 కు తెలియజేయాలని కోరారు.

తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు చోరీ

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళాలు పగలకొట్టి బంగారం, వెండి, నగదు చోరీ చేసినట్టు అందిన ఫిర్యాదు మేర ఎస్‌ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా నివశిస్తున్న చేపల వ్యాపారి షేక్ అజ్మీర్ ఈ నెల 4న అమెరికా వెళ్ళారు. అజ్మీర్ వద్ద భీమవరపు ముబీన్ గుమస్తాగా పనిచేస్తూ ముస్లీం వీధిలో నివసిస్తున్నాడు. ముబీన్ రెండు రోజులకొకసారి అజ్మీర్ ఇంటికి వచ్చి తాళాలు చూసి వెళుతున్నాడు. ఈ నెల 10న రాత్రి వచ్చినప్పుడు అంతా సక్రమంగా ఉందని, 13న వచ్చి చూడగా తాళాలు పగలకొట్టి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అజ్మీర్‌కు ఫోన్ చేసి విషయం తెలియచేశారు. బీరువాలో మూడు కాసుల బంగారం, వెండి వస్తువులు, కొంతమేర నగదు ఉండాలని చెప్పగా పరిశీలించగా లేకపోవడంతో సోమవారం రాత్రి ముబీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించారు.

కోడి పందేలపై దాడి

కాళ్ళ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం బొండాడలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1200 నగదు, కోడిపుంజు, కోడికత్తి, స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాము కాటుతో రైతుకి అస్వస్థత

పోలవరం అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : పాముకాటుతో పాడిరైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం పోలవరం పంచాయతీలో జరిగింది. వివరాల్లోకి వెళితే నూతనగూడెం గ్రామానికి చెందిన ఉడతా గంగాధర్ పశువుల మేత కోసం పంట చేలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతనిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు అతనికి ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

ఏలూరు నగరంలో దొంగల జోరు

పోలీసు నిఘా వైఫల్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోనే పోలీసులకు దొంగలు సవాళ్ళు విసిరినట్లు నేరాలకు పాల్పడుతున్నారు. కొద్ది రోజులుగా నగరంలో పరిశీలన జరిపితే నేరస్తులు రెచ్చిపోతున్నారు. తెల్లవారేటప్పటికి ఏదో ఒక ఇంట్లో కన్నం వేస్తున్నారు. నగరంలో శాంతిభద్రతలు కాపాడడానికి మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, నేరస్తులను పసిగట్టడానికి ఒక సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. అయినప్పటికీ ఇటీవల దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఏలూరు టూటౌన్, త్రి టౌన్, రూరల్ ప్రాంతాల్లో ఈ నేరాలకు ఎక్కువగా పాల్పడుతున్నారు. త్రి టౌన్ పరిధిలో మాత్రం ఒకే ఒక్కడు అన్నట్లుగా ఒక దొంగ మాస్క్ ధరించి నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పాత నేరస్తులు ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు అనే కోణంలో కూడా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇటీవల పోలీసులకు బందోబస్తులు ఎక్కువ కావడంతో నగరంలో పోలీసింగ్ గస్తీ తగ్గిందనే తెలుస్తోంది. దీంతో ఇదే అదనుగా తీసుకున్న దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉందంటే క్షణాల్లో ఆ ఇంటిని దోచేస్తున్నారు. క్లూస్ టీమ్‌లు, పోలీసు జాగిలాలు రంగంలోకి దిగుతున్నప్పటికీ ఫలితాలు రావడం లేదని తెలుస్తుంది. కొత్త నేరస్తుల, పాత నేరస్తులా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. సీసీ కెమెరాల్లో మాత్రం ఒక మాస్క్ ధరించిన నేరస్తుడే నేరాలకు పాల్పడుతున్నట్లుగాపోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరంలో నిఘా పెంచాలని ప్రజలు కోరుతు న్నారు. జిల్లా కేంద్రంలోని వందలాది మంది పోలీసులు ఉండే ప్రాంతంలోనే నేరాలు జరుగుతు న్నాయంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

చొదిమెళ్ళలో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరువెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు చొదిమెళ్ళలో కొండేటి సతీష్‌కుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయన డీఐజీ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. విశాఖపట్నంలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన కుటుంబ సభ్యులతో సహా వెళ్ళారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చేటప్పటికీ ఇంటితాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని కేజీ వెండి వస్తువులు, కొంత బంగారం, కొంత నగదు అపహరణకు గురయ్యాయి. దీంతో ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచే లాసెట్ వెబ్ కౌన్సెలింగ్

16 నుంచి రిజిస్ట్రేషన్‌లు
22 నుంచి కళాశాలల ఎంపిక
28న సీట్ల కేటాయింపు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయ కళాశాలల్లో 2024-25 న్యాయశాస్త్ర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే లాసెట్ 2024 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలుకానుంది. ఈనెల 16వ తేదీ నుంచి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో లాసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ నమోదు కావాలి. 22వ తేదీ నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా వారికి నచ్చిన కళాశాలను ఎంచుకోవాల్సి ఉంది. 26వ తేదీన కళాశాలల ఎంపికలో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకునే విద్యార్థులు కళాశాలను ఎంపిక మార్చుకునే అవకాశం ఉంటుంది. 28వ తేదీన ఎవరికి ఏ కళాశాల వచ్చిందన్న వివరాలతో సీట్లు కేటాయింపు జరుగుతుంది. 29, 30 తేదీలలో సీట్లు కేటాయించిన లా కళాశాలలో విద్యార్థులు చేరాల్సి ఉంటుంది.

వెబ్ కౌన్సెలింగ్‌కి కావాల్సినవి

లాసెట్ వెబ్ కౌన్సిలింగ్ చేసుకునే విద్యార్థులు లాసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. వాటితో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్కుల మెమోస్ పెట్టాలి. టీసీ, ఆధార్ కార్డు, 6వ తరగతి నుంచి టెన్త్ వరకు స్టడీ సర్టిఫికెట్‌ను జతచేయాలి. బి.బి.ఏ. ఎల్.ఎల్.బి, బి.బి.పి. కోర్సుకు ఇంటర్, టెన్త్ మార్క్స్ లిస్టులతో పాటు 6వ తరగతి నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పదవ తరగతి టీ.సీ ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అదే ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం. కోర్సులకైతే టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్క్స్ మెమో, టెన్త్ టీసీ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఎస్సీ, ఎస్టీలకు 500 రూపాయలు, ఓసీ, బీసీలకు 1000 రూపాయలు చెల్లించాలి.



కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో తూర్పు కాపు సంఘ నాయకులు

ఓబీసీ వర్గాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

» కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి బీహెచ్ శ్రీనివాస వర్మ హామీ ఇచ్చినట్టు పట్టణ తూర్పు కాపు సంఘం నాయకులు తెలిపారు. ఓబీసీల సమస్యలపై తమ సంఘ నాయకులు సోమవారం కేంద్రమంత్రి కార్యాలయంలో కలిసి సమస్యను వివరించామని వారు తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి వర్మ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలనే ఉద్దేశ్యంతో సంబంధిత వివరాలు అందించామని, ఒక ప్రాంతంలో తూర్పు కాపులు ఓసీలుగానూ, మరో ప్రాంతంలో బీసీలుగానూ ఉండడం సరిచేయాలని కోరగా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నం చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. సంఘ నాయకులతో పాటు బీజేపీ నాయకులు ఉన్నారు.

మోడి వంతెన కల సాకారం చేయండి

మొగల్తూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు-మోడి గ్రామాల మధ్య దర్భరేవు డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపట్టాలని మొగల్తూరు టీడీపీ నాయకుడు బస్వాని ఏడుకొండలు కోరారు. మంగళవారం మోడి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు వంతెన ఆవశ్యకతను వివరించారు. గత టీడీపీ హయాంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ నుంచి రూ.10 కోట్లు నిధులు మంజూరు కావడంతో అప్పటి ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అనంతరం ఎన్నికలు రావడంతో ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదని అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ నిధులు తీసుకువచ్చి వంతెన నిర్మాణం పూర్తి చేసి తీర గ్రామాల ప్రజల కల సాకారం చేయాలన్నారు.

సాయిధరమ్ తేజ్ పుట్టినరోజు వేడుకలు

భీమవరంటౌన్, అక్టోబరు 15 : మెగా ఫ్యామిలీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో సాయి ధరమ్ తేజ్ అని మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము అన్నారు. భీమవరం ఉండపల్లి కాంప్లెక్స్‌లో భీమవరం మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సాయి ధరమ్ తేజ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన రక్షణ కోసం పనిచేస్తున్న ఆర్మీ కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఆర్థిక సాయాన్ని సాయిధరమ్ తేజ్ అందించాలని అనుకోవడం గొప్ప విషయమని అన్నారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కోపర్తి కోటి, ఎం.బాబి, తోట శేషు, యడపల్లి రాంబాబు, యాతం స్వామి, సుంకర చందు, బొంతు శ్రీను, పి.కల్యాణ్, మునగల సంజయ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలు స్ఫూర్తిదాయకం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ అంబేడ్కర్ ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని డీఆర్‌సీసీ మెంబర్ జక్కంపూడి కుమార్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం అంబేడ్కర్ సాహితీ వేదిక అధ్యక్షుడు కోలాటి చిన పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దిరాజు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ 1944లో పాలకొల్లు వచ్చారని, నేటికి 80 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేస్తున్నట్టు తెలిపారు. స్టేషన్ సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు, స్థానికులు నందబాబు, ఎం.సురేష్ తదితరులు ఉన్నారు.

టెన్నిస్ విజేత దార్శిక్‌కు అభినందనలు

పాలకొల్లు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన పట్టణానికి చెందిన దార్శిక్‌ను రూరల్ సీఐ జి.శ్రీనివాసరావు అభినందించారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదున్నరేళ్ల బాలుడు అద్భుతమైన ప్రతిభ కనబరిచి పాలకొల్లుకు కీర్తిని తీసుకువచ్చాడన్నారు. దార్శిక్‌తో పాటు అమ్మమ్మ అనూరాధ, కోచ్ కిరణ్ తదితరులు ఉన్నారు.

అనాథ మృత దేహానికి 'మానవత' అంతిమ సంస్కారం

భీమవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృత దేహానికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతిమ సంస్కార కార్యక్రమం నిర్వహించారు. భీమవరం వన్‌టౌన్‌లోని కొత్త బస్టాండ్ సమీపంలో మృతి చెందిన మహిళను అనాథగా గుర్తించి వన్‌టౌన్ పోలీసులు అధికారులు సాయంతో అంత్యక్రియలు నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ తెలిపారు.



ప్రభుత్వాసుపత్రిలో పోలీసు ఔట్ పోస్టుకు ఏర్పాటు చేసిన గది

పోలీసు ఔట్ పోస్టు కలేనా ?

» తణుకు ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక గది ఉన్నా.. వినియోగించని వైనం

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసు ఔట్ పోస్టు కలగానే మిగిలిపోయింది. నిత్యం పదుల సంఖ్యలో పలు ప్రాంతాల నుంచి రోడ్డు ప్రమాదాలు, ఇతర అన్ని కేసులకు సంబంధించిన వాటికి స్థానిక పోలీసు ఔట్ పోస్టు అందుబాటులో ఉండాలి. గతంలో ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్న సమయంలోనే అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పుడు జిల్లా ఆసుపత్రిగా మారింది. అయినా అవుట్ పోస్టు ఏర్పాటు కాలేదు. అప్పట్లో ఔట్ పోస్టు ఏర్పాటుకు పోలీసు ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో ఆసుపత్రి వర్గాలు ఆసుపత్రి వద్ద ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. దానిని ప్రభుత్వ సిబ్బందికి వినియోగిస్తున్నారు. పాత పద్ధతిలోనే ఏదైనా కేసు వచ్చినపుడు స్థానికంగా పోలీసులు ఆసుపత్రి సిబ్బంది వెళ్లి సమాచారం ఇవ్వడం జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ఘనంగా జయంతి వేడుకలు

చిత్ర పటాల వద్ద నివాళులు

భీమవరంటౌన్/భీమవరం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు వాడవాడలా మంగళవారం ఘనంగా నిర్వహించారు. భీమవరం వీరమ్మ బీవీ రాజు పార్కులో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం, బీవీ రాజు జయంతి కార్యక్ర మాన్ని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కె.వెంకట రాజు, అరసవల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, బీజేపీ నాయకులు రామాయణం చిన్నారి పాల్గొన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ పాల్గొ న్నారు.

• పాలకొల్లు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ శాస్త్రవేత్తగా అబ్దుల్ కలాం భారతదేశానికి అనేక సేవలందించారన్నారు. తొలుత సెంటర్‌లో వున్న కలాం విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మహ్మద్ జానీ, జనసేన పట్టణ అధ్యక్షుడు శిడగం సూరి, కూటమి నాయకులు షేక్ బాజీ, షేక్ సిలార్, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, మీసాల రాము, చిన్నమల్లి గణపతిరావు పాల్గొన్నారు.

• పాలకోడేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకుని జీవితంలో స్థిరపడాలని భైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ అన్నారు. పెన్నాడ గ్రామంలోని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం పుట్టిన రోజు వేడుకలు పురస్కరించుకుని జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

• తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ వర్సిటీలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.అశోక్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాలకొల్లులో అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద కూటమి నాయకుల నివాళులు

• మొగల్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గల కలామ్ విగ్రహానికి హెచ్‌ఎం పెన్మెత్స రామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగిడి రాంబాబు, కేఎస్‌జీ కృష్ణంరాజు, బి.శ్రీనివాస్, మాధవరావు, రాజేంద్రబాబు, దొంగ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• గణపవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు అన్నారు. మంగళవారం అబ్దుల్‌కలాం జయంతిని స్థానిక వివేకనంద సేవా సమితి కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ లైబ్రేరియన్ చింతలపాటి సూర్యరాజు, చింతలపాటి సత్యనారాయణరాజు, నడింపల్లి శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



వడలిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని



మోడి పంచాయతీలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కృషి : పితాని

పెనుగొండ, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం వడలి, సిద్దాంతం గ్రామాల్లో గ్రామ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా వడలిలో రూ.55 లక్షలు, సిద్దాంతంలో రూ.30 లక్షల వ్యయంతో రోడ్లు, డ్రెయినేజీ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు, కాసాని విజయలక్ష్మి, ఉప్పలపాటి చంటి, తానేటి మదన్, అంగర వరప్రసాద్, అడ్డగర్ల నరసింహమూర్తి, మేక శివయ్య, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

పల్లెపండుగతో గ్రామాలు అభివృద్ధి

మొగల్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి జరిగినట్టు అని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మోడి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి ప్రారంభం, వారతిప్పలో రూ.5లక్షలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రహదారికి ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ మారెళ్ళ మాధవి, తిరుమాని శాంత కుమారి, ఎంపీడీవో త్రిశూల పాణి, తహసీల్దార్ రాజ్ కిషోర్, పీఆర్ డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కె.కుముదవల్లిలో గ్రామదర్శిని కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి

గ్రామాల ప్రగతికి పెద్దపీట : ఆరిమిల్లి

ఇరగవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో హామీ మేరకు సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూనే గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా మంగళవారం కె.కుముదవల్లిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా పాలన సాగుతుందని ఆరిమిల్లి అన్నారు. పల్లె పండుగలో భాగంగా గ్రామంలో రూ.10 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, జనసేన నాయకుడు ఆకేటి కాశీ, ఎంపీడీవో ఎ. శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగలో శంకుస్థాపనలు

అత్తిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతులు పల్లె పండుగ ద్వారా సమకూరుతున్నాయని టీడీపీ అత్తిలి మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ అన్నారు. అత్తిలి మట్టపర్తి గరువు వద్ద రూ. 15 లక్షలతో నిర్మించే అంతర్గత డ్రెయిన్లకు సర్పంచ్ గంటా విజేత నాగరాజు శంకుస్థాపన చేశారు. బొంతు వారిపాలెంలో రూ.4.60 లక్షలతో నిర్మించే మినీ గోకులానికి, వరిఘేడులో రూ.10లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్లు తదితర పనులకు శంకుస్థాపన జరిగింది. ఏఎంసీ మాజీ చైర్మన్లు పోలిశెట్టి చంటి, దాసం బాబ్జీ, ఎ.సత్యనారాయణ, కేతా సత్యనారాయణ, బోడపాటి సూర్యచంద్రరావు, పూతినీడి శ్రీనివాస్, కాసాగాన హనుమంతరావు, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీల సమావేశం నిర్వహించాలి : బొబ్బిలి

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రక్షణ మండలి విజిలెన్స్ కమిటీల సమావేశం వెంటనే నిర్వహించాలని వినియోగదారుల సంఘాల జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాలశాఖలో వినియోగదారుల వ్యవహారాల విభాగాన్ని జిల్లా అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటుచేసి రెండేళ్లు అవుతున్నప్పటికీ ఒక సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. జీఎస్టీ వంటి పన్నులు ఎగవేస్తూ బంగారం, నిత్యావసర వస్తువులు బిల్లులు లేకుండా రోజూ లక్షలాది రూపాయులు వ్యాపారం జరుగుతుందన్నారు. వినియోగదారులు ప్రశ్నిస్తే అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్నారు.

శిలాఫలకంపై పవన్ ఫొటో వేయాలి

ఆచంట/ పెనుగొండ, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ పేరుతో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో లేకుండా శిలాఫలకాలపై పేరు మాత్రమే వేయడంపై పెనుగొండకు చెందిన జనసేన మండల మాజీ అధ్యక్షుడు కంబాల బాబులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదం వల్లే ఈవిధంగా జరిగిందని దీనిపై స్థానిక ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందుల షాపు ఆధ్వర్యంలో వైద్యుడు డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు 29 మందికి ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు చేసి రిపోర్టులు అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, అడ్డాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉండి అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

బీవీ రాజు జయంతి కార్యక్రమాలు

భీమవరం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ బీవీ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీ రాజు 104వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత కళాశాలలోని బీవీ రాజు సమాధి వద్ద ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు నివాళులర్పించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 18 మంది పాఠశాల విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించారు. పేదలకు, ఎయిడ్స్ రోగులకు రూ.60వేలు విలువైన మందులు అందించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. విష్ణు కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాతో లబ్ధి పొందాలి

ఆకివీడు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి తద్వారా లబ్ధిపొందాలని కెనరాబ్యాంకు సిబ్బంది అన్నారు. దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటే కలిగే ఉపయోగాలను వివరించారు. కెనరా బ్యాంకు ద్వారా విద్యార్థులకు జీరో బ్యాలెన్స్ ఖాతాను ప్రారంభించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, బ్యాంకు సిబ్బంది, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

పోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గుమ్మలూరు శివారు రావిగొప్పులో వున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ దాత పెన్మెత్స వెంకట నరసిం హరాజు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు కొత్తపల్లి పూజలు

మొగల్తూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మను మంగళవారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

అన్నసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరుగొలను విజయదుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారికి పూజలు చేసి భారీ అన్నసమారాధన నిర్వహించారు. గురుభ వాని నూకల ధనకృష్ణ, మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య, అన్నవరం తదితరులు పర్యవేక్షించారు.

18 నుంచి గ్రామ సభలు

ఇరగవరం తహసీల్దార్ సుందరరాజు

ఇరగవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 18 నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్టు ఇరగవరం తహసీల్దార్ సుందరరాజు తెలిపారు. మండలంలోని కె.కుముదవల్లి, ఆర్.కండ్రిక, తూర్పు విప్పరు, కె. ఇల్లిందలపర్రు, గోటేరు, ఏలేటిపాడు, అయితంపూడి, సూరంపూడి, రాపాక, అయినపర్రు, ఓగిడి, కాకిలేరు, కంతేరు, కావలిపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

• అత్తిలి : అత్తిలి మండలంలో రెవెన్యూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో 18 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. 18న పాలి, 19న కంచుమర్రు, స్కిన్నెరపురం, 22న ఈడూరు, 23న కొమ్మర, పాలూరు గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు. 24న మంచిలి, 25న ఉనికిలి, 26న తిరుపతిపురం, 28న బల్లిపాడు, 29న గుమ్మంపాడు, వరిగేడు, 30న ఆరవల్లిలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.



కలెక్టర్‌కు సత్కారం

భీమవరంటౌన్, అక్టోబరు 15 : వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞానవేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణిని మంగళవారం అభినందన సత్కారం చేశారు. కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, కృష్ణంరాజు ఉన్నారు.



ప్రత్యేక శిక్షణతో మేధావులుగా మార్చవచ్చు

పెంటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తే మేధావులుగా తీర్చిదిద్దవచ్చని సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త సీహెచ్. సుబ్రహ్మణ్యం, ఎంఈవో టీవీ రామకృష్ణ అన్నారు. పెంటపాడు భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం అభ్యాసనా వైకల్యాలు అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల విషయంలో ఉపాధ్యాయులంతా ప్రత్యేక సమయం కేటాయించాలని, ప్రభుత్వం భవిత విద్యావనరుల కేంద్రాల నుంచి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు స్వరూప, షేక్ మస్తాన్‌బీ, వి.సునీత, ఫిజియోథెరపీ వైద్యుడు డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ పెట్టుబడి సాయం అందించాలి

నరసాపురం రూరల్, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని తక్షణం విడుదల చేయాలంటూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎకరానికి రూ.20 వేలు సాయం ఇవ్వాలని, కులాలతో సంబంధం లేకుండా ఓసీ కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం సాగులో అన్ని ఎరువులు, పురుగు మందులు, మిషన్లు, యంత్రా ల ధరలు పెరిగినందున ఎకరా పంటకు రూ. 1.15 లక్షల సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజరాజేశ్వరికి అందించారు. ఎం.రా మాంజనేయులు, శ్రీనివాస్, సీతారామకృష్ణ, పాండురంగారావు, రామరాజు, వెంకటేశ్వరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం సరుకు స్వాధీనం

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మద్యం దుకాణాల్లో సరుకు, ఇతరత్రా స్వాధీనం చేసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ మర్రి శ్రీనివాస్, ఎస్ఐ వి.కరుణప్రియ తెలిపారు. మంగళవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం తనిఖీ చేసి మాట్లాడారు. ఆకివీడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 23 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రికార్డుల ప్రకారం ఉండాల్సిన సరుకులు, ఇతరత్రా వాటిని పరిశీలించి స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు, వీఆర్వోలు మన్నే శ్రీను, దానయ్య, సాల్మన్‌రాజు తదితరులు ఉన్నారు.



కార్తీకమాసం ఏర్పాట్లపై ఆర్డీవో దాసి రాజుతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

22న కార్తీక మాసం కార్యక్రమాలపై సమావేశం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం వచ్చేనెల 3వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ఈనెల 22న ఉదయం ఆలయంలో ఏర్పాటు చేసే సమావేశానికి ప్రజాప్రతినిధులు, పలు సేవాసంస్థల సభ్యులు హాజరు కావాలని కోరినట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో చేసే ఏర్పాట్లపై ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, నరసాపురం ఆర్‌డీవో దాసి రాజుతో మంగళవారం చర్చించారు.

భక్తులకు సేవా సమితి ఏర్పాట్లు..

కార్తీక మాసంలో క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు నాలుగు సోమవారాలు ఉదయం నుంచి రాత్రి వరకు బాదం పాలు సరఫరా చేయాలని క్షీరారామ లింగేశ్వరస్వామి సేవా సమితి తీర్మానించింది. ఆలయంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ, గాలి గోపురంపై కాషాయ జెండాలను అలంకరించడం, సమితి అధ్యక్షుడు శీరం ఆనందకృష్ణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్టు తెలిపారు.



బాలాత్రిపుర సుందరికి సువర్ణ కంఠాభరణం

భీమవరంటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెంటేవారి తోటలో వున్న విజయకనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారికి భక్తులు రెండు కాసుల సువర్ణ కంఠాభరణం అందించారు. పట్టణానికి చెందిన చవ్వాకుల హేమచంద్రమూర్తి, నాగమణి దంపతులు, శివరామకృష్ణ కుటుంబ సభ్యులు సువర్ణ కంఠాభరణాన్ని మంగళవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. అర్చకులు అమ్మవారికి పూజలు చేసి సువర్ణ కంఠాభరణం అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీర పేరంటాలమ్మకు ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పూజలు

ఉండి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వెలివర్రు వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సతీమణి రమాదేవి, కుమారుడు భరత్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదాలు అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముదునూరి రంగరాజు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సిద్దరాజు, ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.


తప్పుడు విద్యుత్ బిల్లులపై చర్యలు తీసుకోవాలి

భీమవరంటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని 13వ వార్డు యర్రంశెట్టి వారి వీధి శివారు బేతనిపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ గంటా మేరి సుందరిబాయి నివాసంలో లేకపోయినా రెండు నెలలుగా రూ.8 వేలు బిల్లులు రావడం దారుణమని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అన్నారు. సర్వీస్ నంబరు 23452 గల ఇంటి కరెంట్ మీటర్‌పై వచ్చిన బిల్లులపై ఎలక్ట్రిసిటీ ఏఈ, డీఈలు సమాధానం చెప్పాలన్నారు. ఈ బిల్లులపై ఆగస్టులో ఇండస్ట్రియల్ ఏరియాలోని ఏఈ, డీఈలకు ఫిర్యాదు చేశారన్నారు.

అన్ని వార్డులు క్లీన్‌గా ఉండాలి

నరసాపురం, టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డులు శానిటేషన్ సమస్య లేకుండా క్లీన్‌గా ఉండాలని కమిషనర్ అంజయ్య ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్, చెత్త తొలగింపు పనుల్ని ఆకస్మికంగా పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురికినీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సిల్టును ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. చంటిబాబు, రాజు, జయరాజు, లావణ్య పాల్గన్నారు.

కరుణాకర్ చౌదరి మృతి



కరుణాకర్ చౌదరి (ఫైల్)

పెంటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మౌంజిపాడు గ్రామానికి చెందిన జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి తమ్ముడు, టీడీపీ నాయకుడు పాతూరి కరుణాకర్ చౌదరి (49) గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు, కోరుమిల్లి సర్పంచ్ గారపాటి భాస్కరరావు, నల్లమిల్లి చినగోపిరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.